భయపడుతూ కూర్చుంటే, బతకలేవు. ఎదైనకాని అని, ఒక అడుగు ముందుకు వేసి చూడు. గెలుపు అయితే నిన్ను ముందుకు నడిపిస్తుంది.ఓటమి అయితే తర్వాత ఏంచేయాలో నేర్పిస్తుంది.
Laxmi Devotional

DD9 వార్త
తెలుగు దినపత్రిక

టైటిల్, ఫస్ట్ లుక్ మాత్రమే కాదు..
ఏప్రిల్ 8న అంతకుమించి!



సంపుటి : 01 సంచిక : 204 హైదరాబాద్, మార్చి, శనివారం 14, 2026 పేజీలు : 08 వెల : 3.00



# రాష్ట్రంలో సిలిండర్!

**తీవ్రమవుతున్న వాణిజ్య గ్యాస్ కొరత**
**చర్లపల్లిలోని 3 ప్రభుత్వ గ్యాస్ ప్లాంట్లలో రీ ఫిల్లింగ్ నిలిపివేత**
**వంట గ్యాస్‌కే ప్రాధాన్యత ఇవ్వడంతో రోడ్లపైనే లారీలు**
**ఏజెన్సీల నుంచి స్టాక్ లేదనే సమాధానం**
**ఆందోళనలో స్టార్ హోటళ్లు, బడా రెస్టారెంట్లు..**
**మూతపడుతున్న చిన్న హోటళ్లు**
**పరిశ్రమల్లో సైతం ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం**
**పాల ఉత్పత్తి కేంద్రాలపైనా ప్రభావం చూపించే చాన్స్**
**ప్రైవేటు గ్యాస్ ఏజెన్సీలపై పెరుగుతున్న ఒత్తిడి**
**పౌర సరఫరాల శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం వల్ల పెట్రో ఉత్పత్తుల సరఫరాకు అంతరాయం కలుగుతుండటం, కేంద్రం ఆంక్షల నేపథ్యంలో.. రాష్ట్రంలో వాణిజ్య ఎల్‌పీజీ (కమర్షియల్ గ్యాస్) సిలిండర్ల కొరత తీవ్రరూపం దాల్చింది. గ్యాస్ ప్లాంట్లలో కమర్షియల్ సిలిండర్లను నింపే ప్రక్రియ ఆగిపోయింది. స్టార్ హోటళ్లు, పెద్ద రెస్టారెంట్లు, క్లబ్బుల నుంచి చిన్న టీ దుకాణాల వరకు గ్యాస్ కోసం ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొంది.
ఓ పది సిలిండర్లు సర్దండి'అంటూ గ్యాస్ ఏజెన్సీలను వేడుకుంటున్నా స్టాక్ లేదనే సమాధానమే

..మిగతా 3లో

# ఇదేనా రాజ్యాంగాన్ని కాపాడే మీ నైతికత?



**రాహుల్ గాంధీని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్ రావు**
**పార్టీ ఫిరాయింపుల విషయంలో రాహుల్ గాంధీ తీరుపై ఆగ్రహం**
**ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడతామని మేనిఫెస్టోలో పెట్టారన్న హరీశ్ రావు**
**రాజ్యాంగ రక్షణ అంటే ఫిరాయింపులను ప్రోత్సహించడమా అని ఎద్దేవా**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సమర్థిస్తారా? లేక చర్యలకు ఆదేశిస్తారా? అని ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి మాజీ మంత్రి హరీశ్ రావు లేఖ రాశారు. పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని బలోపేతం చేస్తామని, ప్రజాస్వామ్య

..మిగతా 2లో



# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**స్పాట్‌లోనే నలుగురు దుర్మరణం**
**గన్నారం సమీపంలో బోల్తాపడ్డ ట్రావెల్స్ బస్సు**
**ఆ సమయంలో బస్సులో 22 మంది ప్రయాణికులు**
**డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం**
**క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించిన పోలీసులు**

**నిజామాబాద్, (ప్రజాక్షేత్రం):**
నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి వేళ జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇందల్వాయి మండలం గన్నారం సమీపంలోని జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకోవడం స్థానికంగా

..మిగతా 2లో

# గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత...

**గ్యాస్, పెట్రోల్ సరఫరాను కేంద్రం తక్షణమే మెరుగుపరచాలన్న పొన్నం**
**ఈ కొరతపై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్**
**మూసీ ప్రాజెక్టుపై తుషార్ గాంధీకి ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని వ్యాఖ్య**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు.
దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను

..మిగతా 2లో



# మూసీ పునరుజ్జీవనానికి మద్దతిస్తాం

**పేదల ఇళ్లు కూల్చేందుకు అంగీకరించం**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**
**ప్రజా జీవనాన్ని దెబ్బ తీయొద్దని సూచనలు**
**సబర్మతి ప్రాజెక్టు గురించి తెలుసుకోవాలని హితవు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
హైదరాబాద్ నగరంలో ప్రవహించే మూసీ నది పునరుజ్జీవనానికి భారతీయ జనతా పార్టీ ఎప్పటికీ వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లు కూల్చడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు

..మిగతా 2లో



# శశికళ కొత్త పార్టీ

**'ఆలిండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కళగం' పేరుతో చిన్నమ్మ పార్టీ**
**ఏఐడీఎంకే పార్టీ ఓట్లను చీల్చబోతున్నారా?**
**చిన్నమ్మ వెంట నడిచేవారు ఎవరు?**
**విజయ్ పార్టీ మీద ఎఫెక్ట్ ఉంటుందా?**
**ఎన్నికల వేళ తమిళనాడులో కొత్త చర్చ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో

..మిగతా 3లో




# గ్యాస్ కొరత లేదు

**ప్రజలు ఆందోళన చెందొద్దు**
**తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు**
**జనం అవసరానికి మించి సిలిండర్లు నిల్వ చేసుకోవద్దు**
**సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరుస్తాం**
**గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు నిబంధనల ప్రకారం వ్యవహరించాలి**
**బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**
**అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
రాష్ట్రంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ ప్రచారం జరుగుతున్న వదంతులపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొందరు కావాలనే అపోహలు సృష్టిస్తున్నారని, సరఫరా వ్యవస్థను దెబ్బతీయాలనే ప్రయత్నాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ కొరతపై ఇటీవల

..మిగతా 3లో



# నెలసరిలో సెలవులు కుదరవు

**తప్పనిసరి చేస్తే మహిళలకే ప్రమాదం**
**వాళ్ల ఉద్యోగాలకే ముప్పు వాటిల్లే చాన్స్**
**సెలవులు తప్పనిసరి చేస్తే మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు**
**కంపెనీలకు ప్రైవేటు సంస్థలకు సూచించగలం కానీ ఆదేశించలేము**
**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):**
మహిళలకు నెలసరి సమయంలో ప్రత్యేక సెలవులు తప్పనిసరి చేసేలా చట్టం తీసుకురావాలన్న డిమాండ్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అలాంటి చట్టాన్ని అమలు చేస్తే మహిళల ఉపాధి

..మిగతా 2లో

# గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ**
**హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక**
**చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన**
**బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్**
**గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి**



# నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని నాగ్ పూర్‌కు ప్రయాణికులతో బయలుదేరిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో అదుపుతప్పి బోల్తా పడింది. బస్సులో మొత్తం 22 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రయాణికులంతా నిద్రలో ఉండగా ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో వారు ఒక్కసారిగా తీవ్రంగా గాయపడ్డారు. బస్సు వేగంగా ప్రయాణిస్తుండగా డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో రోడ్డుపై నుంచి పక్కకు వెళ్లి బోల్తా పడినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాదం సంభవించిన వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులు గాయాలతో కేకలు వేయడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు.

**నలుగురు అక్కడికక్కడే మృతి**

ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మరికొందరు తీవ్రంగా గాయపడగా, పలువురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న టోల్‌ప్లాజా సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని బస్సు నుంచి బయటకు తీసి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అంబులెన్సులను పిలిపించి క్షతగాత్రులను చికిత్స కోసం తరలించారు. ఈ ఘటనలో పలువురికి తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు.

**ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు**

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సును రోడ్డు నుంచి తొలగించి ట్రాఫిక్‌ను సవ్యంగా పునరుద్ధరించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల అసలు కారణాలను తెలుసుకునేందుకు విచారణ కొనసాగుతోంది. ప్రాథమిక సమాచారం ప్రకారం బస్సు అతివేగంతో ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాత్రి సమయంలో రహదారులు ఖాళీగా ఉండటంతో డ్రైవర్లు వేగంగా వాహనాలు నడపడం సాధారణంగా జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వేగ నియంత్రణ లేకపోవడం ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

అయితే డ్రైవర్ అలసట, రహదారి పరిస్థితి, వాహన యాంత్రిక లోపం వంటి ఇతర కారణాల కోణంలో కూడా పోలీసులు విచారణ చేపడుతున్నారు. డ్రైవర్‌ను విచారించి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ భాగం డ్రైవర్ అలసట, నిద్ర మత్తు, అతివేగం కారణంగానే జరుగుతున్నాయి. ముఖ్యంగా లాంగ్ డిస్టెన్స్ ట్రావెల్స్ బస్సులు గంటల తరబడి నిరంతర ప్రయాణం చేయడం వల్ల డ్రైవర్లపై ఒత్తిడి పెరుగుతుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లకు తగిన విశ్రాంతి లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే బస్సులపై ప్రత్యేకంగా పర్యవేక్షణ



అవసరమని సూచిస్తున్నారు.

**ప్రయాణికుల్లో భయాందోళనలు**

ఈ ప్రమాదంతో బస్సులో ప్రయాణిస్తున్న మిగతా ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా బస్సు బోల్తా పడడంతో ఏమి జరుగుతోందో అర్థం కాకపోయిందని కొందరు తెలిపారు. ప్రయాణికుల కేకలు, గాయాలతో పరిస్థితి తీవ్రంగా మారిందని చెప్పారు. కొంతమంది ప్రయాణికులు బస్సు గాజులు పగలగొట్టి బయటకు వచ్చారని సమాచారం. అనంతరం స్థానికులు సహాయం అందించి వారిని బయటకు తీసినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన తర్వాత కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బస్సు రహదారిపై అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

**భద్రతపై ప్రశ్నలు**

ఈ ఘటనతో మరోసారి రహదారి భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై వేగ నియంత్రణ, డ్రైవర్‌ల పని గంటలు, వాహనాల సాంకేతిక తనిఖీలు వంటి అంశాల్లో కఠిన నియంత్రణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. డ్రైవర్లు నిర్దేశిత వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుల వివరాలు, గాయపడిన వారి పరిస్థితిపై మరిన్ని వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అధికారులు గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



## ఇదేనా రాజ్యాంగాన్ని కాపాడే మీ నైతికత?

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థలను కాపాడతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి.. రాజ్యాంగాన్ని చేతబట్టి దేశవ్యాప్తంగా నీతిసూత్రాలు చెప్పిన మీరు కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం మరోలా వ్యవహరిస్తున్నారని నిలదీశారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షించడం అంటే ఇదేనా? దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బోధించే రాజ్యాంగ నైతికత ఇదేనా అని ప్రశ్నించారు.

**ఇంతకంటే ఆధారం ఇంకేం కావాలి?:**

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం వాడుకుంటున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ టికెట్‌పై ఎమ్మెల్యేగా ఎన్నికైన దానం నాగేందర్ అధికారికంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఇచ్చిన BFormతో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇది ఊహాగానమో, వదంతో కాదు. ఇది ప్రజా రికార్డుల్లో ఉన్న నిజం. అయినా కూడా దానం పార్టీ మారారు అనడానికి ఎలాంటి ఆధారాలు లేవు తెలంగాణలో మీ పార్టీకి చెందిన శాసనసభ స్పీకర్ చెబుతున్నారు. ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీ BForm పై ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ద్రోహానికి ఆధారం కాకపోతే, పదో షెడ్యూల్ ప్రకారం ద్రోహానికి ఆధారం అంటే అర్థం ఏంటో దేశం మొత్తం తెలుసుకోవాల్సిన ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు. ఇదేనా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడే విధానం? దేశానికి మీరు బోధించే రాజ్యాంగ నైతికత ఇదేనా? అని నిలదీశారు.

**ప్రసంగాలతో రాజ్యాంగాన్ని కాపాడలేరు:**

ఒక పార్టీ టికెట్‌పై ఎన్నికైన శాసనసభ్యుడు, మరో పార్టీ జెండా కింద ఎన్నికల్లో పోటీ చేసి కూడా ఎమ్మెల్యేగా కొనసాగితే రాజ్యాంగ ఆత్మ కేవలం రాజకీయ నినాదంగా మారిపోతుందన్నారు. ఢిల్లీలో రాజ్యాంగాన్ని కాపాడుతున్నామని చెప్పి, తెలంగాణలో దాన్ని బలహీనపరచడం ఎలా సమర్థించగలరు? అని నిలదీశారు. అందువల్ల విప్ మార్పిడి చట్టం ప్రకారం దానం నాగేందర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి, స్పీకర్‌కు మీరు సూచిస్తారా? లేకపోతే, కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడటం రాజకీయ ప్రయోజనం ఉన్నప్పుడేనా అని దేశం భావించాలో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజలు, అలాగే దేశ ప్రజలు నిజాయితీగల సమాధానాన్ని ఆశిస్తున్నారని రాజ్యాంగాన్ని కేవలం ప్రసంగాలతో కాపాడలేమన్నారు.

## గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత...

మొదటిపేజీ తరువాయి

మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు. మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.

బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.



## గ్యాస్ కొరతపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

- ఎల్పీజీ సిలిండర్ల కొరతపై కేంద్రానికి కేటీఆర్ లేఖ
- హోటళ్లు, హాస్టళ్లు మూతపడే ప్రమాదమని హెచ్చరిక
- చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా గుర్తించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

దేశంలో వాణిజ్య, గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడిందని, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి ఒక లేఖ రాశారు.

ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కారణంగా హోటళ్లు, తినుబండారాలు, పీజీ హాస్టళ్లు, చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని కేటీఆర్ తన లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. సరఫరాను వెంటనే పునరుద్ధరించకపోతే, వేలాది సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, వాటిపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు.



ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు కేటీఆర్ కేంద్రానికి కొన్ని కీలక సూచనలు చేశారు. చిన్న వ్యాపారులకు ప్రాధాన్యతనిచ్చేలా ఎల్పీజీ కేటాయింపుల విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. జిల్లాల వారీగా సిలిండర్ల లభ్యతపై పారదర్శక సమాచారం కోసం రియల్‌టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షోభ సమయంలో చిన్న వ్యాపారులపై అదనపు భారం పడకుండా వాణిజ్య సిలిండర్ల ధరల పెరుగుదలను తాత్కాలికంగా నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు మళ్లించి, అధిక ధరలకు విక్రయించే బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐటీ కారిడార్ ప్రాంతాల్లోని పీజీ హాస్టళ్లను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, అంతరాయం లేని సరఫరాను అందించాలని కోరారు. అలాగే, గ్యాస్ ఆధారిత శ్మశానవాటికలను అత్యవసర సేవలుగా వర్గీకరించి, వాటి కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చూడాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇది లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్య అని, వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## నెలసరిలో సెలవులు కుదరవు

మొదటిపేజీ తరువాయి

అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. కంపెనీలు మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడంలో వెనుకడుగు వేసే పరిస్థితులు కూడా తలెత్తవచ్చని ధర్మాసనం సూచించింది.

మహిళలకు నెలసరి సమయంలో ప్రత్యేక సెలవులు ఇవ్వడం తప్పనిసరి చేసేలా విధానాలు రూపొందించాలని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తీసుకునే కొన్ని చర్యలు అనుకోకుండా వారి ఉపాధి అవకాశాలను తగ్గించేలా మారవచ్చని ఆయన హెచ్చరించారు.

విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ నెలసరి సెలవుల అంశాన్ని జాగ్రత్తగా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ''మహిళలకు సహాయకంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవడం ఒక విషయం అయితే, వాటిని చట్టబద్ధంగా తప్పనిసరి చేయడం మరో విషయం. ఒకవేళ నెలసరి సెలవులను తప్పనిసరి చేస్తూ చట్టం తీసుకువస్తే అది ఉద్యోగ రంగంలో అనుకోని సమస్యలను తెచ్చిపెట్టే ప్రమాదం ఉంది'' అని వ్యాఖ్యానించింది.

ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, ''అలాంటి చట్టం అమల్లోకి వస్తే మహిళలు పురుషుల కంటే తక్కువ సామర్థ్యం కలవారన్న భావన కొందరిలో కలగవచ్చు. సంస్థల యాజమాన్యాలు కూడా అలా ఆలోచించే ప్రమాదం ఉంది. ఆ కారణంగా ఉద్యోగాల్లో మహిళలను నియమించుకోవడంలో వెనుకంజ వేయవచ్చు. దాంతో మహిళల ఉపాధి అవకాశాలు తగ్గే పరిస్థితి ఏర్పడొచ్చు'' అని అన్నారు.

అదే సమయంలో రుతుక్రమం వంటి సహజ శారీరక ప్రక్రియపై సమాజంలో అవగాహన పెంపొందించడం అవసరమని కోర్టు స్పష్టం చేసింది. అయితే అవగాహన కల్పించడం ఒకటి అయితే, దానిని చట్టబద్ధంగా సెలవుల రూపంలో తప్పనిసరి చేయడం మరో అంశమని ధర్మాసనం అభిప్రాయపడింది. సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడమే ముఖ్యమని పేర్కొంది.

విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది M. R. Shamshad వాదనలు వినిపించారు. దేశంలో ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలు, ప్రైవేటు కంపెనీలు మహిళలకు నెలసరి సమయంలో ప్రత్యేక సెలవులు మంజూరు చేస్తున్నాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని కొన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవులు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛందంగా నెలసరి సెలవులను అమలు చేస్తున్నాయని, ఆ విధానాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారికి ఉపశమనం కల్పించడమే ఈ విధానాల ఉద్దేశమని తెలిపారు.

ఈ వాదనలపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, అవి పూర్తిగా స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయాలేనని చెప్పారు. ఒక సంస్థ స్వచ్ఛందంగా ఇలాంటి సదుపాయాన్ని కల్పించడం మరియు దానిని చట్టబద్ధంగా అందరికీ తప్పనిసరి చేయడం రెండూ వేర్వేరు అంశాలని పేర్కొన్నారు. చట్టం ద్వారా బలవంతం చేస్తే పరిస్థితులు మారవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

''ప్రైవేటు సంస్థలు లేదా విద్యాసంస్థలు తమ నిర్ణయాల ప్రకారం కొన్ని సదుపాయాలు కల్పించవచ్చు. కానీ ప్రభుత్వం చట్టం ద్వారా ప్రతి సంస్థకు అదే విధానాన్ని తప్పనిసరి చేస్తే అది వేరే సమస్యలకు దారితీయవచ్చు. సంస్థల యాజమాన్యాలు ఉద్యోగ నియామకాల విషయంలో కొత్త లెక్కలు వేయడం ప్రారంభించవచ్చు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ సందర్భంగా గతంలో కూడా ఇదే అంశంపై సుప్రీంకోర్టు అభిప్రాయాలు వ్యక్తం చేసిన విషయాన్ని కోర్టు ప్రస్తావించింది. మహిళలకు నెలసరి సెలవులు ఇవ్వడం వల్ల కొంతమేర వారికి ఉపశమనం లభించవచ్చు. అలాగే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలు ముందుకు రావడానికి కూడా ఇది ప్రోత్సాహం కలిగించవచ్చని కొందరు భావిస్తున్నారని తెలిపింది.

అయితే మరోవైపు దీనిని తప్పనిసరి చేయడం వల్ల కొన్ని సంస్థలు మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోవడంలో సంకోచించవచ్చని కూడా కోర్టు అభిప్రాయపడింది. ఉద్యోగ అవకాశాల పరంగా మహిళలు వెనుకబడే పరిస్థితి తలెత్తకూడదనే దృష్టితో ఈ అంశాన్ని సమతుల్యంగా చూడాల్సిన అవసరం ఉందని ధర్మాసనం పేర్కొంది.

''మహిళల సంక్షేమం కోసం తీసుకునే కొన్ని చర్యలు అనుకోకుండా వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఇలాంటి అంశాలపై చట్టపరమైన నిర్ణయాలు తీసుకునే ముందు అన్ని కోణాలను పరిశీలించడం అవసరం'' అని కోర్టు అభిప్రాయపడింది.

మహిళల ఆరోగ్యం, గౌరవం, ఉపాధి అవకాశాలు అన్నీ సమానంగా పరిరక్షించబడే విధంగా విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. మహిళలపై వివక్ష పెరగకుండా చూసే బాధ్యత సమాజం మొత్తం మీద ఉందని కూడా కోర్టు స్పష్టం చేసింది.

నెలసరి సెలవుల అంశంపై దేశవ్యాప్తంగా గత కొన్ని సంవత్సరాలుగా చర్చ జరుగుతోంది. కొన్ని రాష్ట్రాలు, సంస్థలు స్వచ్ఛందంగా ఇలాంటి విధానాలను అమలు చేస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా ఒకే విధమైన చట్టాన్ని తీసుకురావాలా అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు చేసిన తాజా వ్యాఖ్యలు మహిళల ఉపాధి, సంక్షేమ విధానాలపై కొనసాగుతున్న చర్చకు కొత్త కోణాన్ని తెచ్చాయి. మహిళల ప్రయోజనాలు దెబ్బతినకుండా ఉండేలా సమగ్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

## మూసీ పునరుజ్జీవనానికి మద్దతిస్తాం

ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్‌పై ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మూసీ అభివృద్ధి అంశాన్ని రాజకీయంగా మలచి బీజేపీపై తప్పుదారి పట్టించే ప్రచారం చేయడం సరికాదని ఆయన అన్నారు. మూసీ నది పునరుద్ధరణకు సంబంధించి ప్రభుత్వం నిర్వహిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని రాంచందర్ రావు తెలిపారు. మూసీ నది అభివృద్ధి, పునరుజ్జీవనానికి సంబంధించిన కార్యక్రమాలను తమ పార్టీ ఎప్పటికీ వ్యతిరేకించలేదని స్పష్టం చేశారు. అయితే ఆ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవనాధారాన్ని దెబ్బతీయకుండా ఉండాలనే అంశాన్ని ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు.

**మూసీ నది శుభ్రతకు మద్దతు**

మూసీ నది హైదరాబాద్ నగరంలో ప్రవహించి చివరకు కృష్ణా నదిలో కలుస్తుందని గుర్తు చేసిన రాంచందర్ రావు, ఆ నది మార్గం అంతా పరిశుభ్రంగా ఉండాలని తమ పార్టీ కోరుకుంటోందన్నారు. ప్రస్తుతం మూసీ నది కాలుష్యంతో తీవ్రంగా ప్రభావితమైందని ఆయన చెప్పారు. నదిలో పరిశుభ్రమైన నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవడం అత్యవసరమని అన్నారు. మూసీ నది శుద్ధి చేసి అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేస్తే అది కేవలం నగరానికి మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాలకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ఆ నీటిని రైతులు సాగునీటి కోసం వినియోగించుకునే అవకాశం ఉండాలని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ నేతలు పదే పదే బీజేపీపై ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని రాంచందర్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర నాయకులు బీజేపీ వైఖరిని తప్పుగా చిత్రీకరించడం సరికాదని అన్నారు.

**పేదల ఇళ్లు కూల్చడంపై అభ్యంతరం**

మూసీ నది అభివృద్ధి పేరుతో అక్కడ నివసిస్తున్న పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా గాంధీ సరోవర్ నిర్మాణం పేరుతో ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని చెప్పారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించబడిన ఇళ్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను నిరాశ్రయులను చేయడం అభివృద్ధి కాదని అన్నారు. ఆ ఇళ్లను కూల్చకుండా కూడా మూసీ నదిని శుద్ధి చేయడం సాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు ప్రజల జీవనాధారాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రాజెక్టులను అమలు చేయడం సరైన మార్గం కాదని తెలిపారు.

**సబర్మతి ఉదాహరణ**

మూసీ నది అభివృద్ధిని సబర్మతి నది ప్రాజెక్టుతో పోల్చే నాయకులు ముందుగా ఆ ప్రాజెక్ట్ ఎలా అమలయ్యిందో తెలుసుకోవాలని రాంచందర్ రావు సూచించారు. ఒకప్పుడు సబర్మతి నది కూడా మూసీలా కాలుష్యంతో నిండిపోయి దుర్వాసనతో ఉండేదని ఆయన గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ నదిని పునరుజ్జీవింపజేసే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని చెప్పారు. నర్మదా నది నుంచి నీటిని మళ్లించి సబర్మతికి చేరేలా చేసి, నదుల అనుసంధానం ద్వారా ఆ ప్రాజెక్టును విజయవంతం చేశారని వివరించారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని ఆయన చెప్పారు. సుమారు నాలుగు వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు అందించిన తర్వాతే సబర్మతి నది అభివృద్ధి పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. ఇలాంటి విధానాన్ని అనుసరించడం వల్ల ప్రజలకు నష్టం లేకుండా అభివృద్ధి సాధ్యమైందని ఆయన అన్నారు. ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని ఆయన వ్యాఖ్యానించారు.

# గ్యాస్ కొరత లేదు

**మొదటిపేజీ తరువాయి**



ప్రజల్లో ఏర్పడిన గందరగోళాన్ని దృష్టిలో పెట్టుకొని మంత్రి సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లాల కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితి, డిమాండ్-సప్లై వ్యవస్థపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.

**రాష్ట్రంలో సరిపడా నిల్వలు**

సమీక్ష సమావేశంలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నాయని వెల్లడించారు. గృహ వినియోగదారులు, హోటళ్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు, పరిశ్రమలకు అవసరమైన మేరకు సరఫరా కొనసాగుతోందని చెప్పారు. సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు కూడా సమావేశంలో వివరించినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ కొరత ఉందన్న ప్రచారం సోషల్ మీడియా ద్వారా వేగంగా వ్యాపించడంతో ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడిందని మంత్రి అన్నారు. ఇలాంటి వదంతులను నమ్మవద్దని, అవసరానికి మించి సిలిండర్లు నిల్వ చేసుకోవద్దని ప్రజలకు సూచించారు.

**వదంతులపై అప్రమత్తత**

గ్యాస్ కొరత ఉందన్న వార్తలు ప్రచారం కావడంతో కొన్ని చోట్ల వినియోగదారులు ముందస్తుగా సిలిండర్లు బుక్ చేసుకోవడం ప్రారంభించినట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు మంత్రి తెలిపారు. దీని వల్ల కొంతకాలం సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పడే అవకాశం ఉందని చెప్పారు. అందుకే ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు స్థానిక స్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తూ ప్రజలకు సరైన సమాచారం అందించాలని మంత్రి ఆదేశించారు. సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల్లో తప్పుడు ప్రచారం జరిగితే వెంటనే ఖండించాలని సూచించారు.

**బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు**

గ్యాస్ కొరత ఉందన్న అపోహలను ఉపయోగించుకొని కొందరు సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌కు తరలించే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. గ్యాస్ నిల్వలు దాచిపెట్టడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు, పోలీసు కమిషనర్లు సమన్వయంతో పని చేసి అక్రమాలను అరికట్టాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

గ్యాస్ సరఫరా విషయంలో గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు, వసతి గృహాలు వంటి కీలక రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి సూచించారు. ఎక్కడైనా సరఫరా లోపం ఉన్నట్లయితే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయిల్ కంపెనీలతో సమన్వయం కొనసాగించాలని కూడా సూచించారు.

ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన సరఫరాపై కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మధ్యప్రాచ్య ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ మార్కెట్లపై ప్రభావం పడే అవకాశాలపై చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో దేశంలో కూడా గ్యాస్ సరఫరాపై ప్రజల్లో కొన్ని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే కేంద్ర ప్రభుత్వం మరియు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు దేశవ్యాప్తంగా సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. నిల్వలు తగినంతగా ఉన్నాయని, సాధారణ సరఫరా కొనసాగుతోందని తెలిపారు. దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థ ఒక సమగ్ర వ్యవస్థగా పనిచేస్తుంది. ఆయిల్ కంపెనీలు దిగుమతులు, రిఫైనరీలు, నిల్వ కేంద్రాలు, బాట్లింగ్ ప్లాంట్ల ద్వారా సిలిండర్లను తయారు చేసి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా వినియోగదారులకు అందిస్తాయి. ఈ వ్యవస్థలో ఒక దశలో సమస్య వచ్చినా వెంటనే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరా కొనసాగించే విధానం ఉంటుంది.

తెలంగాణలో కూడా పలు బాట్లింగ్ ప్లాంట్లు, నిల్వ కేంద్రాల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోంది. జిల్లాల వారీగా డిస్ట్రిబ్యూటర్లు వినియోగదారులకు సిలిండర్లు అందిస్తున్నారు. అందువల్ల ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా కొరత ఏర్పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

**ప్రజలకు సూచనలు**

గ్యాస్ కొరతపై వస్తున్న వదంతులను నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి సిలిండర్లు నిల్వ చేసుకోవడం వల్ల ఇతరులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని చెప్పారు. సాధారణ వినియోగ విధానాన్ని కొనసాగిస్తే సరఫరా వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని తెలిపారు. గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు కూడా నిబంధనల ప్రకారం సరఫరా నిర్వహించాలని, ఎక్కడైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**సమీక్షల కొనసాగింపు**

గ్యాస్ సరఫరా పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తుందని మంత్రి తెలిపారు. అవసరమైతే మరిన్ని సమీక్షా సమావేశాలు నిర్వహించి జిల్లాల వారీగా పరిస్థితిని పరిశీలిస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. మొత్తంగా రాష్ట్రంలో గ్యాస్ కొరతపై వస్తున్న వార్తలు వాస్తవానికి విరుద్ధమని ప్రభుత్వం స్పష్టం చేసింది. సరఫరా వ్యవస్థ సాధారణంగానే కొనసాగుతోందని, ప్రజలు అపోహలకు లోనుకాకుండా నమ్మకంతో ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

# రాష్ట్రంలో సిలిం'డర్'!

**మొదటిపేజీ తరువాయి**

వినిపిస్తోంది. ఎంత ధర చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా ఫలితం ఉండటం లేదు. దీంతో చిన్న హోటళ్లు మూతపడుతున్నాయి. స్టార్ హోటళ్ల యాజమాన్యాల్లో కూడా పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. హోటళ్లతో పాటు పారిశ్రామిక ఉత్పత్తులపై కూడా గ్యాస్ కొరత తీవ్ర ప్రభావం చూపిస్తోంది.

రాష్ట్రంలో వినియోగమయ్యే ఎల్‌పీజీ గ్యాస్‌లో గృహ వినియోగం, హోటళ్లు, బేకరీలు, స్వీట్ దుకాణాలలో వినియోగించే గ్యాస్‌తో పోలిస్తే పరిశ్రమలకు వినియోగించే గ్యాసే ఎక్కువ. వీటితో పాటు పాలు, వాటి అనుబంధ ఉత్పత్తులు సరఫరా చేసే డెయిరీల్లో కూడా ఎల్‌పీజీ గ్యాస్ మంటలు రేపుతోంది. ఈ కారణంగా పాల సేకరణ నిలిచిపోతే గ్రామీణ పాడి పరిశ్రమ తీవ్ర సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామనే ప్రకటనలు తప్ప ఇతర వర్గాల గురించి పౌరసరఫరాల శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

హైదరాబాద్ నగర శివారులోని చర్లపల్లి ప్రాంతంలో భారత్, హెచ్‌పీ, ఇండియన్ ఆయిల్ కంపెనీలకు సంబంధించిన మూడు ప్రధాన ఎల్‌పీజీ ఫిల్లింగ్ ప్లాంట్లు ఉన్నాయి. రాష్ట్రంలో ఖాళీ అయిన గ్యాస్ సిలిండర్లన్నింటిలో ఎల్‌పీజీని ఇక్కడి నుంచే రీ ఫిల్లింగ్ చేస్తారు. అయితే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయిల్ కంపెనీలు ఇచ్చిన సూచనలతో చర్లపల్లిలో వాణిజ్య సిలిండర్లను ఫిల్ చేసే ప్రక్రియ దాదాపుగా నిలిచిపోయింది. ఇప్పటికే ఉన్న స్టాక్‌ను కొద్దికొద్దిగా సర్దుతున్నారు.

రోజుకు 2 వేల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్లు తీసుకునే ఏజెంట్‌కు 100 నుంచి 200 సిలిండర్లు ఇవ్వడం గగనంగా మారిందని అంబర్‌పేటకు చెందిన ఓ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపారు. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సరఫరాకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుండటంతో కమర్షియల్ సిలిండర్ల ఫిల్లింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు చెపుతున్నారు. దీంతో వందలాది గ్యాస్ లారీలు ప్లాంట్ల వెలుపల కిలోమీటర్ల మేర బారులు తీరాయి. సిలిండర్లతో వచ్చిన ట్రక్కులు రోజుల తరబడి నిలిచిపోవడంతో డ్రైవర్లు, క్లీనర్లు రోడ్లపైనే నిరీక్షించాల్సి వస్తోంది.

**పరిశ్రమల్లో ఉత్పత్తి ఆగే పరిస్థితి**

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రోజుకు వేల టన్నుల ఎల్‌పీజీ వినియోగిస్తుంటాయి. నాచారం, ఉప్పల్, ఐడీఏ బొల్లారం, బాలానగర్, సనత్‌నగర్, కాటేదాన్, పటాన్‌చెరులలోని దాదాపు అన్ని పరిశ్రమలల్లో ఎల్‌పీజీ గ్యాస్ వినియోగం పెద్ద ఎత్తున ఉంటుంది. 19 కిలోల ఎల్‌పీజీ నుంచి 33, 47, 425, 450 కిలోల ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లను పారిశ్రామిక అవసరాల కోసం వినియోగిస్తుంటారు. భారీ పరిశ్రమలకు టన్నుల ఎల్‌పీజీతో కూడిన ట్యాంకర్ (బులెట్)లను వినియోగిస్తారు.

నగరంలోని బిస్కట్ కంపెనీలు, చాక్లెట్, పప్పు పాకెట్లు, మిఠాయిలు, తినుబండారాలు తయారు చేసే పరిశ్రమలు కూడా భారీగా గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు ఓ ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకుడు తెలిపారు. మొత్తం ఎల్‌పీజీ వినియోగంలో పరిశ్రమలు దాదాపు 40 శాతం వాటా కలిగి ఉన్నట్లు ఓ అంచనా. కాగా దీనిపై ఆంక్షలు ఉన్న నేపథ్యంలో నగరంలో సేవారంగం, ఉత్పత్తి, ఆహార రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. కొన్ని పరిశ్రమలు ప్రైవేట్ గ్యాస్ కంపెనీలపై ఆధారపడుతున్నా అక్కడ కూడా సరఫరా పరిమితంగా ఉండటంతో పరిస్థితి క్లిష్టంగా మారుతోంది.

**పాడి పరిశ్రమపై ప్రభావం!**

హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో ఉన్న పరిశ్రమలతో పాటు రాష్ట్రంలోని ప్రధానమైన పాల ఉత్పత్తి కేంద్రాలు, దానా తయారీ కేంద్రాలు చిక్కుల్లో పడే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సహకార రంగంలో ఉన్న విజయ డెయిరీ, కరీంనగర్ డెయిరీ, ముల్కనూరు డెయిరీ, మదర్ డెయిరీ తదితరాలతో పాటు ప్రైవేటు రంగంలో కొన్ని పదుల సంఖ్యలో డెయిరీలు రాష్ట్రంలో కొనసాగుతున్నాయి.

గ్రామాల నుంచి పాలు సేకరించి, వాటిని శుద్ధి చేసి లక్షల లీటర్ల పాలను ప్రతిరోజు రాష్ట్ర వ్యాప్తంగా విక్రయిస్తున్నారు. పాల ప్రాసెసింగ్‌లో భాగంగా వేడి చేసేందుకు, పెరుగు, నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల తయారీకి ప్రతిరోజు గ్యాస్ సిలిండర్లు పెద్ద ఎత్తున అవసరం అవుతాయి. కాగా గ్యాస్ అందుబాటులో లేకపోతే డెయిరీల్లో కూడా ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

**ప్రైవేట్ గ్యాస్ కంపెనీలకు బారులు**

ప్రభుత్వ రంగ సంస్థల నుంచి సరఫరా తగ్గిపోవడంతో హోటల్ యజమానులు, పరిశ్రమల



నిర్వాహకులు ప్రైవేట్ ఎల్‌పీజీ కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేటు రంగంలోని గో గ్యాస్, టోటల్, అజియాస్, సూపర్, స్ఫూర్తి, భాగ్యనగర్ గ్యాస్ వంటి ప్రైవేటు కంపెనీలపై ఒత్తిడి పెరుగుతోంది. ఆయా గ్యాస్ ఏజెన్సీలు ఇప్పటికే ఎల్‌పీజీ గ్యాస్ ధరను కిలో రూ.140కి పెంచాయి. 7వ తేదీకి ముందు ఇది రూ.104గా ఉంది. ఇక 21 కిలోల ప్రైవేటు ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ రూ.3 వేలు పలుకుతోంది. దీన్ని బ్లాక్‌లో రూ.5 వేలకు కూడా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ రంగంలోని మూడు కంపెనీల ఏజెన్సీలు కూడా బ్లాక్‌లో సిలిండర్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. కాగా దేవాలయాల్లో జరిగే అన్నదాన కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల తయారీపై కూడా గ్యాస్ కొరత ప్రభావం పడింది. హాస్పిటళ్లలో, జీహెచ్‌ఎంసీ పరిధిలో రూ.5కే భోజనం అందించే హరేకృష్ణ ఫౌండేషన్‌కు ప్రతిరోజు దాదాపు 100 సిలిండర్లు అవసరం. సిలిండర్ల సరఫరా లేకపోతే ఆ సంస్థకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

# శశికళ కొత్త పార్టీ




మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ తాజా నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. గత కొంతకాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న శశికళ ఇప్పుడు సొంత రాజకీయ పార్టీని ప్రకటించి తిరిగి ఎన్నికల రంగంలోకి రావడం గమనార్హం.

'ఆలిండియా పురుచ్చి తలైవార్ మక్కల్ మున్నేట్ర కళగం' పేరుతో ఆమె కొత్త పార్టీని స్థాపించినట్లు ప్రకటించారు. తమిళ రాజకీయాల్లో ప్రభావం చూపిన ప్రముఖ నాయకుడు M. G. Ramachandran అభిమానులు ఆయనను 'పురుచ్చి తలైవార్'గా సంభోదిస్తారు. ఆ భావోద్వేగాన్ని గుర్తుచేసేలా పార్టీ పేరులో అదే పదాన్ని ఉపయోగించడం ద్వారా ఎంజీఆర్ అభిమానులు, పాత ఏఐఏడీఎంకే క్యాడర్‌ను ఆకర్షించాలన్న వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**పార్టీ గుర్తు, సంకేతాలు**

తన పార్టీకి 'కొబ్బరి చెట్టు'ను గుర్తుగా శశికళ ప్రకటించారు. పార్టీ ప్రకటన సందర్భంగా ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు నివాళులర్పించి తమ రాజకీయ ప్రస్థానం వారి ఆశయాల దిశగా కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతూ రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

జయలలిత మరణం తర్వాత తమిళనాడులో రాజకీయ పరిస్థితులు వేగంగా మారాయి. అప్పట్లో ఏఐఏడీఎంకేలో నాయకత్వ పోరు తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆ పరిణామాల మధ్య శశికళ రాజకీయంగా పక్కకు తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరువాత జైలు శిక్ష కారణంగా ఆమె రాజకీయ కార్యకలాపాలకు విరామం వచ్చింది. ఇప్పుడు మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ద్వారా ఆమె కొత్త ప్రయోగం ప్రారంభించినట్టయింది.

**ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ప్రభావం?**

తమిళ రాజకీయాల్లో ప్రధానంగా రెండు పెద్ద శక్తులు — Dravida Munnetra Kazhagam (డీఎంకే), All India Anna Dravida Munnetra Kazhagam (ఏఐఏడీఎంకే). ఈ రెండు పార్టీల మధ్యే ప్రధాన పోరు కొనసాగుతూ వస్తోంది. అయితే శశికళ కొత్త పార్టీ ప్రవేశం వల్ల ముఖ్యంగా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఎంజీఆర్, జయలలిత కాలంలో ఏఐఏడీఎంకేకు ఏర్పడిన బలమైన క్యాడర్ వ్యవస్థ ఇప్పటికీ రాష్ట్రంలో విస్తరించి ఉంది. ఆ క్యాడర్‌లో ఒక వర్గం ఇప్పటికీ శశికళకు అనుకూలంగా ఉందనే అభిప్రాయం ఉంది. అలాంటి పరిస్థితుల్లో ఆమె కొత్త పార్టీ ఏర్పాటుతో ఆ వర్గం కొంతవరకు ఆమె వైపు వెళ్లే అవకాశాన్ని విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు.

అలా జరిగితే ఏఐఏడీఎంకేకు సంప్రదాయంగా లభించే ఓట్లలో కొంత చీలిక వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

**ఓట్ల చీలిక – ఎవరికి లాభం?**

తమిళనాడు రాజకీయాల్లో ఓట్ల చీలిక చాలా కీలక పాత్ర పోషిస్తుంది. శశికళ పార్టీ ఎన్నికల్లో గణనీయంగా పోటీ చేస్తే ప్రధానంగా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. ఎందుకంటే శశికళ రాజకీయంగా ఎదిగింది కూడా అదే పార్టీ వేదికపైనే.

ఒకవేళ ఏఐఏడీఎంకే ఓట్లు విభజనకు గురైతే దాని ప్రత్యక్ష లాభం అధికార పార్టీ అయిన డీఎంకేకు దక్కే అవకాశముందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే ప్రత్యర్థి ఓట్లు విడిపోయినప్పుడు అధికార పార్టీకి గెలుపు సులభం కావచ్చు.

అయితే మరోవైపు, శశికళ పార్టీ పూర్తిగా ప్రభావం చూపకపోతే అది పెద్ద మార్పు తీసుకురాకపోవచ్చని కూడా కొందరు అభిప్రాయపడుతున్నారు. ఆమె పార్టీ బలం పూర్తిగా స్థానిక స్థాయిలో క్యాడర్‌ను ఎంతవరకు సమీకరించగలదనే దానిపై ఆధారపడి ఉంటుంది.

**విజయ్ పార్టీపై ప్రభావం?**

ఇటీవల సినీ నటుడు Vijay స్థాపించిన Tamilaga Vettri Kazhagam కూడా తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. యువతలో మంచి అభిమానాన్ని కలిగిన విజయ్ రాజకీయ ప్రవేశం ఇప్పటికే రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అంశంగా మారింది. ఈ నేపథ్యంలో శశికళ పార్టీ ఆవిర్భావం విజయ్ పార్టీపై ఎంతవరకు ప్రభావం చూపుతుందన్న అంశంపై కూడా చర్చ జరుగుతోంది. రాజకీయంగా చూస్తే విజయ్ పార్టీ ప్రధానంగా యువత, సినీ అభిమానుల ఓట్లను లక్ష్యంగా పెట్టుకున్నదని భావిస్తున్నారు. అయితే శశికళ పార్టీ మాత్రం సంప్రదాయంగా ఏఐఏడీఎంకేకు మద్దతు ఇచ్చే ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించే అవకాశం ఉంది.

అందువల్ల ప్రత్యక్షంగా విజయ్ పార్టీ ఓటు బ్యాంకుపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే కొన్ని నియోజకవర్గాల్లో మూడు లేదా నాలుగు పార్టీలు పోటీ చేస్తే ఓట్ల విభజన కారణంగా అనూహ్య ఫలితాలు రావచ్చని కూడా చెబుతున్నారు.

**రాజకీయ సమీకరణాలు మారుతాయా?**

శశికళ పార్టీ ఏర్పాటుతో తమిళనాడులో ఎన్నికల సమీకరణాలు కొంతవరకు మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఏఐఏడీఎంకేకు చెందిన పాత నాయకులు, కార్యకర్తలు ఎంతమేర ఆమెకు మద్దతు ఇస్తారన్నది కీలక అంశంగా మారింది. ఒకవేళ శశికళకు బలమైన నాయకులు, క్యాడర్ మద్దతు లభిస్తే ఆమె పార్టీ కొన్ని నియోజకవర్గాల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది. అదే సమయంలో అది ఏఐఏడీఎంకే ఓట్లను తగ్గించే పరిస్థితి తలెత్తితే రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు కనిపించవచ్చు.

**ఎన్నికల బరిలో కొత్త పోటీ**

తమిళనాడు రాజకీయాలు సంప్రదాయంగా బలమైన నాయకత్వం, కేడర్ ఆధారంగా నడుస్తాయి. ఈ నేపథ్యంలో శశికళ తిరిగి రాజకీయాల్లోకి రావడం ఒక ఆసక్తికర పరిణామంగా మారింది. ఆమె పార్టీ ఎంతమేర ప్రజల్లో స్పందన పొందుతుందన్నది రాబోయే నెలల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

మొత్తంగా చూస్తే శశికళ పార్టీ ఆవిర్భావం తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. ఇది ప్రధానంగా ఏఐఏడీఎంకే ఓటు బ్యాంకుపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో ఓట్ల చీలిక జరిగితే అధికార పార్టీకి లాభం కలగవచ్చన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ కొత్త రాజకీయ ప్రయోగం ఎంతవరకు ఫలితం ఇస్తుందన్నది రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర అంశంగా మారింది. ఎన్నికల ప్రచారం ప్రారంభమయ్యే సమయానికి పార్టీల మధ్య కూటములు, వ్యూహాలు ఎలా మారతాయన్నది కూడా కీలకంగా మారే అవకాశం ఉంది.

# డ్రైవింగ్ లైసెన్స్ మేళా యువతకు ఆహ్వానం.

- **బజారత్నూర్ పోలీస్ స్టేషన్ నందు వివరాలను నమోదు చేసుకోవాలి.**
- **ఈనెల 18 వరకు అవకాశం**
- **ఎస్సై జి సంజయ్ కుమార్.**

**బజార్హాత్నూర్, మార్చి 13,(డిడి9న్యూస్):**




ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల పరిధిలోని యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందేందుకు ముందుకు రావాలని బజార్ హత్నూర్ ఎస్సై జి.సంజయ్ కు మార్ ఒక ప్రకటన ద్వారాకోరారు. డ్రైవింగ్ లైసెన్స్ మేళాకు వచ్చే ఆసక్తి గల అభ్యర్థులుఈ నెల 18వ తేదీలోగా బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.అభ్యర్థుల ఆధార్ కార్డు, పదవతరగతి మార్కులజాబితా,చిరునామా, తదితరాల నిజ ధ్రువపత్రాల నకళ్ళతో పాటు మీ సమీప మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని సంబంధిత పత్రాలను పోలీస్ స్టేషన్ వచ్చిఅందజేయాలని ఆయన సూచించారు.వాహనాలు నడిపే ప్రతి ఒకరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలనునివారించవచ్చని ఎస్సై తెలిపారు. యువత ఈ అవకాశాన్నిసద్వినియోగించుకుని డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని కోరారు.

# అడ్లూర్–ఎల్లారెడ్డి గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమం పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కామారెడ్డి, మార్చి 13(డిడి9 వార్త):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం అడ్లూర్-ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ అధికారుల ద్వారా అడ్లూర్ శివారులో నిర్వహిస్తున్న ప్లాస్టిక్ సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తనిఖీ చేసి అధికారులకు తగు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు నేషనల్ హైవేపై ఉన్న డాబా హోటళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. హైవేపై ఉన్న అన్ని డాబా హోటళ్లకు పంచాయతీ కార్యదర్శులు నోటీసులు జారీ చేసి, వారికి అవసరమైన లైసెన్సులు ఉన్నాయా లేదా, అలాగే నేషనల్ హైవే అధికారుల అనుమతి తీసుకున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా నేషనల్ హైవేపై ఉన్న డాబా హోటళ్లను పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, ఎంపీడీవో లు సంయుక్తంగా తనిఖీ చేసి, నేషనల్ హైవే అనుమతులు మరియు గ్రామ పంచాయతీ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాలను నిర్ధారించాలని కలెక్టర్ తెలిపారు. ప్రయాణికులు మరియు ప్రజలు నేషనల్ హైవేపై ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాస్టిక్, ఫుడ్ వేస్టేజ్, పేపర్ వేస్టేజ్ వంటి చెత్తను వేయకుండా రోడ్లను



పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా గ్రామపంచాయతీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. హోటళ్ల నుండి వచ్చే చెత్తను రోడ్డుపై వేస్తే సంబంధిత గ్రామపంచాయతీలు అధిక మొత్తంలో జరిమానాలు విధించాలని కూడా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.





# టెక్రియాల్ చెరువు వద్ద శానిటేషన్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 13(డిడి9 వార్త):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న పరిశుభ్రత కార్యక్రమాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.జిల్లా కేంద్రంలోని టెక్రియాల్ చెరువు వద్ద జరుగుతున్న శానిటేషన్ పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం సదాశివనగర్ - క్రుప్రియల్ హైవే ఇరుపక్కల కొనసాగుతున్న శుభ్రత పనులను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. టెక్రియాల్ చెరువులో గణేష్, దుర్గాదేవి నిమజ్జనం జరిగిన ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, శానిటేషన్ పనులను పూర్తి చేసి ఈరోజు సాయంత్రం లోపు ఆ ప్రాంతాన్ని సమతలంగా చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలు జాగ్రత్త పడాలని, ప్రజాప్రతినిధులు కూడా పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీపీఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, డీఎల్పీఓ శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, కౌన్సిలర్ కొత్తపల్లి లలిత, పంచాయతీ, మున్సిపల్ మరియు శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.











# ఫసల్ భీమా యోజన అమలు చేయాలి

- **బిజెపి మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్**

**బజార్హత్నూర్, మార్చి 13(డిడి9వార్త ):**

తెలంగాణ రాష్ట్రంలో రైతాంగానికి తోడుగా ఫసల్ భీమా యోజన పథకం అమలు చేసి పంట నష్ట పరిహారం అందేలా చేయాలని బిజెపి మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఫసల్ భీమా యోజన పథకం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బజార్ హత్నూర్ మండలంలో రైతుల నుంచి సంతకాల సేకరణ ఉద్యమ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ భీమాయోజన పథకం అమలు చేయక పోవడం వల్ల రైతాంగానికి తీరని నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం వెంటనే పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, రైతు భరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు.రైతు ప్రభుత్వం అని చెప్పూనే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని ఎద్దేవ చేశారు.ఈ నాటి కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్త శంకర్, జి .విరమణ,అల్క గణేష్, సూది నందు, నానం రమణ, చట్ల ఉత్తం,మేకల వెంకన్న, గాజుల నరేష్, సూదివినాయక్,ప్రసన్నరావు, లక్ష్మణ్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



# SDF నిధుల నుండి 10లక్షలు చొప్పన ఇస్తా అని హామీ ఇచ్చిన ఆడే గజేందర్ .

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్( డి డి 9):-**

బోథ్ పట్టణ పురాతన దేవాలయం శ్రీ శివ భక్త మార్కండేయ ఆలయం నూతన ఆలయ నిర్మాణం కొరకై JCB తో తొలిగిస్తున్న సందర్భంగా బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్. సందర్శించి బోథ్ పట్టణ పద్మశాలి సంఘ భవనం గురించి SDF నిధుల నుంచి రెండు విడుతలు గా 10లక్షలు చొప్పున మంజూరు ఇస్తా అని పద్మశాలి సంఘ సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు మరియు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# రాంలీలా మైదానంలో గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి ఉత్సవాలు.

**బజార్హత్నూర్, మార్చి 13,(డిడి9వార్త ):-**




ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 15 వ తేదీ గోండి ధర్మగురు హీరాసుక్క జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నామని ఆదివాసి పర్ధాన్ పురోహిత్ సమాజం సేవాసంఘం ఆదిలాబాద్ జిల్లా.అధ్యక్షులు ఉయిక సుదర్శన్ తెలిపారు.ఈ కార్యక్రమం కు జిల్లాలోని వివిధ మండలాలు,ప్రాంతంలనుంచిఆదివాసిగిరిజనులు, గిరిజనేతరులు, పురుషులు, మహిళలు పెద్ద మొత్తంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పదవ తరగతి స్టూడెంట్స్ కి ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పెన్నులు అందజేసిన టిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు.

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ (డి డి 9):-**

బోథ్ మండల ప్రధాన కార్యదర్శి ఎలుక రాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా 10వ తరగతి పిల్లలకు* పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని గురువులకు పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టాలని చెప్పారు అదే విధంగా ZPSS బోథ్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంలో కొన్ని సమస్యల గురించి హెడ్మాస్టర్ మేడం, మరియు వారి ఉపాధ్యాయ బృందం కొన్ని సమస్యల గురించి తెలియజేయడం జరిగింది వెంటనే ఆ సమస్యలన్నీటిని. గౌరవ శాసనసభ్యులు అనిల్ జాదవ్ గారి సమస్యల్ని వివరిస్తానని సహాయ సహకారాలు, ప్రతి ఒక్కరికి ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షులు వైద్య సురేష్. యూత్ ప్రెసిడెంట్ మెడిచేల్మ ప్రవీణ్. యువ నాయకుడు పాలిక మధు. ఉషన్న. సురేందర్. పాల్గొన్నారు






# రూ.10 లక్షలతో బోథ్‌లో సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ (డి డి 9) :**

గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సమైక్య భవనానికి శుక్రవారం సర్పంచ్ కుర్మె అన్నపూర్ణ మహేందర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరా క్రాంతి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, శిక్షణా కార్యక్రమాలు చేపట్టడానికి ఈ సమైక్య భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, పనులను వేగంగా పూర్తి చేసి మహిళా సంఘాల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సర్పంచ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, సీనియర్ నాయకులు మెరుగు నరసింహ దాస్, అచ్యుతానంద్ రెడ్డి, వార్డు సభ్యుడు కట్ట బుమేష్, వినయ్, పద్మారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి అంజయ్య, భాస్కర్, మహిళా సంఘ నాయకురాళ్లు కట్ట పల్లవి, లావణ్య, గంగామణి, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్: గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడానికి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సమైక్య భవనానికి శుక్రవారం సర్పంచ్ కుర్మె అన్నపూర్ణ మహేందర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరా క్రాంతి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, శిక్షణా కార్యక్రమాలు చేపట్టడానికి ఈ సమైక్య భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా భవన నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, పనులను వేగంగా పూర్తి చేసి మహిళా సంఘాల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను సర్పంచ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ విజయలక్ష్మి రాజారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, సీనియర్ నాయకులు మెరుగు నరసింహదాస్,అచ్యుతానంద్ రెడ్డి,వార్డు సభ్యుడు కట్ట బుమేష్, వినయ్, పద్మారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజయ్య, భాస్కర్, మహిళా సంఘ నాయకురాళ్లు కట్ట పల్లవి, లావణ్య, గంగామణి, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.





# అయోడిన్ గురించి అవగాహన కార్యక్రమం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ (డి డి 9):-**

బోథ్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ వారు అయోడిన్ అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు అయోడిన్ ,థైరాయిడ్ హార్మోన్ ను విడుదల చేయడంలో అవసరమని, ఆహారంలో అయోడిన్ లోపిస్తే గాయిటర్, హైపర్ థైరాయిడిజం వస్తాయని తెలియజేశారు. ఇవి వచ్చినవారు అలసట, అధిక బరువు ,చలిని తట్టుకోలేకపోవడం, పొడి చర్మం లక్షణాలు ఉంటాయని తెలియజేశారు. వీటిని నివారించాలంటే అయోడైజ్డ్ ఉప్పు, గుడ్లు, చేపలు ,పాలు మన ఆహారంలో తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో IGD సభ్యులు దీకొండ రమేష్, మనిషా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్ర గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రజా నాయకుడికే పట్టం




- **రైతు పక్షపాతికే మార్కెట్ పదవి**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ (డి డి 9)**



బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఈసారి బీసీ జనరల్ వర్గానికి కేటాయించబడినట్లు వ్యవసాయ శాఖ వర్గాల నుంచి సమాచారం అందినట్లుగా స్థానిక నాయకులు తెలిపారు. ఈ నేపథ్యంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి వివిధ మండలాల నుండి పలువురు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, బోథ్ ప్రాంతంలో బీసీ వర్గానికి చెందిన బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన చట్ల ఉమేష్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. బోథ్ నియోజకవర్గంలో ప్రజా సేవలో ఎప్పుడూ ముందుండే నాయకుడిగా చట్ల ఉమేష్ మంచి పేరు సంపాదించుకున్నారు. గతంలో ఎక్స్ ఎం పి టి సి పాక్స్ డైరెక్టర్‌గా పనిచేసిన ఆయన రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ రైతుల నమ్మకాన్ని పొందారు. ప్రత్యేకంగా రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో అనేక వ్యవసాయ భూములకు చేరుకునేలా గ్రావెల్ రోడ్లు వేసినట్లుగా రైతులు పేర్కొన్నారు.అలాగే రైతులకు రాకపోకలు సులభంగా ఉండేందుకు కల్వర్టులు నిర్మించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. దీంతో అనేక గ్రామాల రైతులు తమ పంట పొలాలకు సులభంగా చేరుకునే అవకాశం కలిగిందని రైతులు తెలిపారు. అయితే, కొంతమంది వర్గాలు ఈ పదవిని బీసీలకు కాకుండా జనరల్ కేటగిరీకి మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై బోథ్ ప్రాంతంలోని బీసీ సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే బీసీ జనరల్‌గా నిర్ణయించబడిన ఈ పదవిని మార్చకుండా బీసీలకు న్యాయం చేయాలని బీసీ వర్గాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇక మరోవైపు స్థానిక రాజకీయాల మధ్య ఈ పదవి ఎవరికి దక్కుతుందనే ఆసక్తి నెలకొంది. స్థానిక అధికార పార్టీ పెద్ద మొత్తం నాయకుల మద్దతు సైతం ఉమేష్‌కు ఏకగ్రీవంగా ఉందని తెలుస్తోంది. బోథ్ నియోజకవర్గంలోని రైతులు, బీసీ సంఘాల నాయకులు మరియు యువత కూడా చట్ల ఉమేష్‌కు బలమైన మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు. బోథ్ మార్కెట్ కమిటీ అభివృద్ధి, రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం, మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాల్లో ఆయన నాయకత్వం అవసరమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రైతు సంక్షేమం మార్కెట్ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే నాయకుడిగా చట్ల ఉమేష్‌ను బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించాలని పార్టీ అధిష్టానం ప్రభుత్వాన్ని స్థానిక నాయకులు, రైతు సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే బీసీలకు కేటాయించిన ఈ పదవిని అలాగే కొనసాగిస్తూ బీసీ వర్గాలకు న్యాయం చేయాలని వారు స్పష్టం చేస్తున్నారు. ఏదేమైనా సామాజిక సమస్యలపై అవగాహన వాటి పరిష్కారం కోసం పలు రకాలుగా ప్రయత్నిస్తున్న వ్యక్తి ఆపదలో ఉంటే అండగా తాను ఉన్నానని భరోసా కల్పిస్తూ సాగుతున్న ఉమేష్ సేవలను గుర్తించి అధిష్టాన నాయకత్వం ఆశీర్వదించాలని అన్నదాతలు కోరుతున్నారు.

## ప్రపంచ వినియోగదారుల దినోత్సవం నిర్వహణ

- **వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం**

**కామారెడ్డి, మార్చి 13(డిడి9 వార్త):**

ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని జిల్లాలో శుక్రవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్లు, ఎల్‌పీజీ డీలర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అవగాహన అత్యంత ముఖ్యమని తెలిపారు. వినియోగదారులు వస్తువులు లేదా సేవలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవడం, ఉత్పత్తుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించడం, సరైన తూకాలుకొలతలు ఉన్నాయా అనే విషయాలను నిర్ధారించుకోవాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు సరైన తూకాలు మరియు కొలతల వినియోగం, ధృవీకరించిన కొలత పరికరాల ప్రాముఖ్యతపై వివరించారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారి ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పారదర్శకంగా అందించేందుకు శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎఫ్‌పీఎస్ డీలర్లు మరియు ఎల్‌పీజీ డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ వినియోగదారులకు సమయానికి సేవలు అందించాలని సూచించారు. వినియోగదారుల సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పించడంలో చురుకుగా పాల్గొనాలని కోరారు.ఈ సంవత్సరం ప్రపంచ వినియోగదారుల దినోత్సవ థీమ్ "సురక్షిత ఉత్పత్తులు - నమ్మకమైన వినియోగదారులు" అని పేర్కొంటూ, వినియోగదారులకు సురక్షితమైన ఉత్పత్తులు అందేలా మరియు న్యాయమైన వాణిజ్య పద్ధతులు అమలు అయ్యేలా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.




# తెలంగాణకు వడగండ్ల గండం.. మార్చి 15 నుంచి నాలుగు రోజులు వానలు

- **ఆదివారం 18 జిల్లాలు.. సోమవారం 32 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**
- **భద్రాచలం, మహబూబ్నగర్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**
- **ఎల్లుండి నుంచి నాలుగు రోజుల పాటు వానలు**

**హైదరాబాద్, మార్చి 13(డిడి9వార్త ):-**




రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వడగండ్ల వానలు పడే అవకాశముంది. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు పడుతాయని, కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలకు చాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదివారం 18 జిల్లాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఆయా జిల్లాలతో పాటు మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్కర్నూల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మొత్తంగా ఆరోజు 32 జిల్లాల్లోనూ వర్షాలు పడుతాయని తెలిపింది. మంగళ, బుధవారాలకు ఎలాంటి అలర్ట్ జారీ చేయకపోయినా.. పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలర్ట్ జారీ చేసిన రోజుల్లో మాత్రం వడగండ్లు పడే ప్రమాదం ఎక్కువగా ఉందని హెచ్చరించింది.

**రెండు జిల్లాల్లో 40 డిగ్రీలు**

రాష్ట్రంలో టెంపరేచర్లు పెరుగుతున్నాయి. గురువారం 2 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కు్న దాటాయి. భద్రాచలంలో గరిష్టంగా 40.2 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. మహబూబ్నగర్లోనూ 40 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదిలాబాద్లో 39.3, ఖమ్మంలో 39, నిజామాబాద్లో 38.8, రామగుండంలో 38, హైదరాబాద్లో 37.2 చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, రాష్ట్రంలో వర్షాలతో పాటే ఎండలు కూడా తీవ్రమవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

## పకోడీ తెమ్మన్న భార్య- - - వచ్చేసరికి మాయమైపోయింది!

**రాంపూర్ (బజార్ హత్నూర్ )(డిడి9వార్త ):-**

ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఓ వింత ఘటన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తుండగా భార్య పకోడీ తీసుకురమ్మని భర్తను పంపింది. భర్త పకోడీ తీసుకుని వచ్చేసరికి ఆమె అక్కడ కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్రోహా జిల్లాకు చెందిన ప్రీతమ్ సింగ్ గత ఏడాది డిసెంబర్ 1న రాంపూర్ జిల్లాకు చెందిన రింజిమ్ (18)ను వివాహం చేసుకున్నాడు. ఇటీవల హోలీ పండుగ సందర్భంగా రింజిమ్ తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. పండుగ ముగిసిన తర్వాత మార్చి 9న ప్రీతమ్ అత్తగారింటికి వెళ్లి తన భార్యను తీసుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఇద్దరూ బిలారి బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఇంతలో రింజిమ్ ఆకలిగా ఉందని చెప్పి పకోడీలు తీసుకురమ్మని భర్తను కోరింది. దీంతో ప్రీతమ్ పకోడీలు కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. ఇదే సమయంలో రింజిమ్ అక్కడి నుంచి పరారైంది. పకోడీలు తీసుకుని తిరిగి వచ్చిన ప్రీతమ్‌కు భార్య కనిపించకపోవడంతో బస్టాండ్ మొత్తం వెతికాడు. అయినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో అతను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన భార్య ఒక యువకుడితో వెళ్లిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు బస్టాండ్ పరిసరాల సీసీటీవీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. అలాగే ఆమె మొబైల్ లొకేషన్‌ను ట్రేస్ చేస్తూ గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.



## మండలంలో కొనసాగుతున్న ఉచిత గాలికుంటూ టీకాలు.



**బజార్ హత్నూర్,మార్చి 13(డిడి 9వార్త ):-**

బజార్ హత్నూర్ మండలం పశువులకు, మేకలకు,గొర్రెలు, గేదెలు తదితర పాడిసంపదకు సంబందించినవాటికి పశు శాఖ వారి తరపున వేసవిలో గాలికుంటూ వ్యాధులు సోకకుండా ఉచితంగా టీకాలు వేస్తున్న కార్యక్రమం కొనసాగుతున్నది.ఇందులో భాగంగా శుక్రవారం రోజుమండలంలోని లక్ష్మి నాయక్ తండా, పాత దెగమాగ్రామం లలోపశువులకు ఉచితగాలికుంటూ నివారణ టీకాల శిభిరంనిర్వహించి టీకాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బందిసి.హెచ్.అరవింద్, మారుతీ,సుధాకర్,జగన్,ఠాకూర్ సూరజ్, ఆ రెండు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ఎల్పీజీ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి – కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 13(డిడి9 వార్త):**

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా నిరంతరం సజావుగా కొనసాగేందుకు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు మరియు డిస్ట్రిబ్యూటర్లతో సమన్వయం చేసుకొని పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నిల్వ కేంద్రాలు మరియు డిస్ట్రిబ్యూటర్ల గోదాముల్లో ఉన్న ఎల్పీజీ స్టాక్ పరిస్థితిని ప్రతిరోజూ సమీక్షించాలని సూచించారు. గ్యాస్ నిల్వ ఉంచడం, అక్రమ మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్, అనధికార వినియోగం వంటి చర్యలను కట్టడి చేయాలని తెలిపారు. అవసరమైతే ఎస్సెంటిల్ కమోడిటీస్ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ చైర్మన్‌గా, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి కన్వీనర్‌గా ఉంటారు. పోలీస్, రెవెన్యూ, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు, రవాణా, వైద్య ఆరోగ్య, వ్యవసాయ, విద్యా, సంక్షేమ శాఖల అధికారులు మరియు ఎల్పిజి డిస్ట్రిబ్యూటర్ల అసోసియేషన్ ప్రతినిధులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.డిస్ట్రిబ్యూటర్లు వారి డెలివరీ సిబ్బంది ద్వారా వినియోగదారుల నుండి అదనపు ధరలు వసూలు చేయకూడదని, వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంక్షేమ సంస్థలు తమ వద్ద ఉన్న LPG స్టాక్ లభ్యతను ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. గృహ వినియోగ LPG సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగించడం, నిల్వ ఉంచడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై ఎస్సెంటిల్ కమోడిటీస్ యాక్ట్ 1955లోని సెక్షన్ 6A కింద కేసులు నమోదు చేయాలని ఆయన తెలిపారు.ఇదిలా ఉండగా రాష్ట్రంలో LPG సరఫరాపై వినియోగదారుల్లో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మరియు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో అపోహలు సృష్టించే తప్పుడు ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 810 LPG డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందని, రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల LPG కనెక్షన్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. రోజుకు సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని వెల్లడించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదుకాలేదని పేర్కొన్నారు.అపోహలను ఆసరాగా చేసుకుని గ్యాస్ నిల్వ చేయడం, అక్రమ మళ్లింపు, బ్లాక్ మార్కెటింగ్ వంటి చర్యలకు పాల్పడితే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి హెచ్చరించారు. ఇటువంటి అక్రమాలపై ఇప్పటివరకు 288 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకొకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకొకసారి LPG సిలిండర్ బుక్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. అవసరానికి మించి బుకింగ్ చేయకుండా అపోహలను నమ్మకూడదని, గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా అందిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు.



## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ పురోగతిపై సమీక్ష

**కామారెడ్డి, మర్చి 13(డిడి9 వార్త):**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ పురోగతిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి SIR మ్యాపింగ్ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల్లో మ్యాపింగ్ శాతాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. డెమోగ్రాఫికల్‌గా సమానమైన ఎంట్రీలు గుర్తింపు, వాటి పరిశీలనపై కూడా చర్చించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించే అంశంపై పలు సూచనలు చేశారు. అలాగే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన ప్రాథమిక ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వీణ, తహసీల్దార్ హిమబిందు, కలెక్టర్ కార్యాలయం ఎన్నికల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.










# వర్ని మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు – లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**బాన్సువాడ, మార్చి 13(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం వర్ని మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి మరియు నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పాల్గొని పలు ప్రారంభోత్సవాలు నిర్వహించి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.వర్ని మండలం నెహ్రూ నగర్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించిన జనరల్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. అలాగే ఎమ్‌జీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు. అనంతరం వర్ని జనరల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. వర్ని మండలానికి చెందిన 27 మంది లబ్ధిదారులకు రూ.27,03,132/ విలువైన చెక్కులు, రుద్రూర్ మండలానికి చెందిన 21 మంది లబ్ధిదారులకు రూ.21,02,436/ విలువైన చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం 48 మంది లబ్ధిదారులకు రూ.48,05,568/ విలువైన చెక్కులు అందజేశారు.అదేవిధంగా ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వర్ని, రుద్రూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.







## బోథ్ పట్టణంలో పలు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నరేష్ జాదవ్ మరియు జిల్లా నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చి 13 (డి డి 9)**

ఈరోజు బోత్ పట్టణంలోని స్థానిక న్యూ కాలనీలో పూర్తయిన ఇందిరమ్మ ఇండ్లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది.

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం జరుగుతుందని. ప్రతి పేదవాడికి కూడు గుడ్డ తోపాటు ఉండటానికి గౌరవప్రదమైన ఇల్లు ఉండాలని, సొంతింటి కల అనేటువంటిది సమాజంలో వ్యక్తులను గౌరవంగా నిలబెడుతుందని తెలియజేశారు. ఇంతే కాకుండా మరి కొన్ని రోజులలోనే పలు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మల్లేష్, మాజీ ఎంపీటీసీ శేక్ రజియా బేగం, వార్డు సభ్యులు షేక్ షాకీర్, పద్మారావు, సంతోష్ గిరిజ బాయ్, కౌసర్, పోతన, మాజీ వార్డు సభ్యులు తుకారం, లతోపాటు పలు కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొనడం జరిగింది.



## సాలూరలో అంగన్వాడీ కేద్రాన్ని తనిఖీ చేసిన వైద్యాధికారి

- **సాలూర లో అంగన్వాడీ కేద్రాన్ని తనిఖీ చేసిన వైద్యాధికారి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండల కేంద్రంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీలో భాగంగా కేంద్రంలోని చిన్నారుల ఆరోగ్యం, వారికి అందుతున్న పౌష్టికాహారంపై డాక్టర్ రాజ్ కుమార్ ఆరా తీశారు. గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, వైద్య సేవలు సకాలంలో అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో రికార్డులను సైతం పరిశీలించారు. కేంద్రంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, పరిశుభ్రత, చిన్నారులకు అందుతున్న విద్యాబోధన పట్ల వైద్యాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్ బి.గోదావరిని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు, పౌష్టికాహార పంపిణీకి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ఉన్నారు.



## పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత



నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) : భీంగల్ మండలం బెజ్జోర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ముందు ఉత్సాహాన్ని నింపేలా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులకు ప్రోత్సాహకంగా పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందించారు.గ్రామ సర్పంచ్ మేస కార్తీక్ సోదరుడు మేస కపిల్ తన వంతు సహకారంతో ఈ విద్యా సామగ్రిని సమకూర్చారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మేస కార్తీక్ ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ మూడేల్ల లింబయ్య చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంతో, ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు. కష్టపడి చదివి, మంచి మార్కులతో ఉత్తీర్ణులై పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, వార్డు సభ్యులు దివాకర్, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి.. గ్రామాల్లో ఫ్రైడేడ్రైడే

**బోధన్, నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రజా పాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కదిలారు. ఇందులో భాగంగా శుక్రవారం సాలూర మండలంలోని తగ్గెల్లి, జాడి జమల్పూర్ గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యాధుల వ్యాప్తిని దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. తగ్గెల్లి గ్రామంలో సర్పంచ్ అరుణ స్వయంగా పర్యటించి, గ్రామ ప్రజలు వినియోగించే నీటి ట్యాంకులను క్షుణ్ణంగా పరిశీలించారు. నీటి నిల్వ ఉన్న పాత్రలను ఖాళీ చేయించి వాటిని ఎండబెట్టడం ద్వారా దోమల లార్వా ఉత్పత్తిని అరికట్టాలని ఆమె గ్రామస్థులకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటేనే రోగాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత టైర్లు, కుండీలలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గంగమల్లయ్య, జాడి జమల్పూర్ ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.





## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి బీర్కూర్ లయన్స్ క్లబ్ సహాయం

**బీర్కూర్, మార్చి 13(డిడి9 వార్త):**

బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన కుటుంబానికి నిత్యావసర వస్తువులు, బట్టలు అందజేశారు.వారం రోజుల క్రితం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి తుక్కవ్వ ఇంటిలో అగ్నిప్రమాదం చోటుచేసుకుని ఇల్లు, బీరువా, బట్టలు సహా పలు సామగ్రి కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న గ్రామ యువకులు పర్సా రవి లయన్స్ క్లబ్ సభ్యులకు సమాచారం అందించారు.దీనిపై వెంటనే స్పందించిన బీర్కూర్ లయన్స్ క్లబ్ సభ్యులు సుమారు రూ.5,000 విలువైన నిత్యావసర వస్తువులు మరియు బట్టలను బాధిత కుటుంబానికి వారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలే రమేష్, సీనియర్ లయన్స్ సభ్యులు కిషోర్ ప్రభు దాస్, మురలీ సెట్, సాయి కృష్ణ, భరత్ పాల్గొన్నారు. అలాగే గ్రామ యువకులు పర్సా రవి, కృష్ణ, బుమేష్ మరియు గ్రామ ప్రజలు కూడా పాల్గొన్నారు.



## శ్రీ ఆంజనేయ స్వామి దీక్ష స్వాముల 17వ సామూహిక మహామండల పూజ కరపత్రాల ఆవిష్కరణ

**బాన్సువాడ, మార్చి 13(డిడి9 వార్త):**

పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా శ్రీ ఆంజనేయ స్వామి దీక్ష స్వాముల 17వ సామూహిక మహా మండల పూజ కరపత్రాలు శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించబడ్డాయి. బాన్సువాడ రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఉన్న ఎమ్మెల్యే స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మార్చి 21న విశ్వశాంతి కోసం అష్టోత్తర శత కుండాత్మక (108) సుందరకాండ పారాయణ సహితంగా 162వ శ్రీ హనుమాన్ మహా యజ్ఞం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే శ్రీదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, వడల పూజ మహోత్సవం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.సుందరకాండ పారాయణ సహిత మహా యజ్ఞం మార్చి 21 శనివారం ప్రారంభమై, మార్చి 22 ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్విరామంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ ప్రతినిధులు అంబిలిపూర్ రాజు స్వామి, పాలకుర్తి దత్తు స్వామి, తులసి రామ్ మారుతి స్వామి, కల్లేటి వెంకటరమణ స్వామి, నరేష్ స్వామి, విజయ స్వామి, ప్రశాంత్ రెడ్డి స్వామి, శ్రీనివాస్ స్వామి, వేణుగోపాల్ రెడ్డి స్వామి, మహేష్ స్వామి, శివరాజ్ స్వామి, అర్జున్ స్వామి తదితరులు పాల్గొన్నారు.


## పీఎం కిసాన్ 22వ విడత నిధుల విడుదల

- **బైరాపూర్ రైతు వేదికలో కార్యక్రమం వీక్షణ**

**బీర్కూర్, మర్చి 13(డిడి9 వార్త):**

దేశ ప్రధాని నరేంద్రమోడీ అస్సాం రాష్ట్రంలోని గువాహటి లో నిర్వహించిన కార్యక్రమంలో యాసంగి పెట్టుబడి సహాయం కింద పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 22వ విడత నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా 9.32 కోట్ల మంది రైతుల ఖాతాల్లో డిజిటల్ విధానంలో నేరుగా రూ.19 వేల కోట్ల రూపాయలు జమ అయ్యాయి.ఈ కార్యక్రమాన్ని బైరాపూర్ రైతు వేదికలో అగ్రికల్చర్ ఏఈఓ రాజేష్‌తో కలిసి స్థానిక రైతులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు .ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు నాగెళ్ళ సాయికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి యాసంగి పంట పెట్టుబడి సహాయం కింద రైతులకు "రైతు భరోసా" పేరిట సంవత్సరానికి మూడు విడతలుగా రూ.15,000 ప్రతి రైతు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే ఇప్పటివరకు రైతులకు ఆర్థిక సహాయం అందకపోవడం వల్ల ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపుతోందని విమర్శించారు.తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 65 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద సుమారు రూ.27 వేల కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ తరపున ధర్నా కార్యక్రమాలు చేపట్టి రైతులకు మద్దతుగా నిలుస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పోచిగొండ, సాయిబాబా, గంగారాం, రాజు తదితరులు మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## భీంగల్ లో సాహితీ రత్నం మొల్లకు ఘన నివాళి

**నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

తెలుగు సాహితీ యవనికపై తనదైన ముద్ర వేసిన కవయిత్రి, కుమ్మరి కులదీపిక మొల్ల మాంబ జయంతి వేడుకలను శుక్రవారం భీంగల్ పట్టణంలోని శాలివాహన సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. శాలి వాహన సంఘం అధ్యక్షుడు గొల్లపల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సురేష్ మాట్లాడుతూ... 16వ శతాబ్దానికి చెందిన మొల్లమాంబ సాధారణ కుటుంబంలో జన్మించిన తన అపారమైన ప్రతిభతో తెలుగు సాహిత్యంలో అగ్రగణ్యురాలిగా నిలిచారని కొనియాడారు. రామాయణాన్ని సామాన్యులకు కూడా అర్థమయ్యేలా, సరళమైన భాషలో 'మొల్ల రామాయణం' పేరుతో ఆమె రచించడం ఆమె పాండిత్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, నేపథ్యంతో సంబంధం లేకుండా పట్టుదల, భక్తి ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపించారని, మహిళలకు ఆమె ఆదర్శప్రాయురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సాగర్, సుఖేష్, సాయికుమార్, ప్రశాంత్, నిశాంత్, పురుషోత్తం, రాజేశ్వర్, శ్యామ్, రాములు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



### ఘనంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

## కవిత పుట్టినరోజు వేడుకలు



**నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత జన్మదిన వేడుకలను శుక్రవారం పార్టీ శ్రేణులు నిజామాబాద్ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు ఆమెకు ఘనంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అవంతి రావు మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తం చేయడంలో కవిత గారు పోషించిన పాత్ర అద్వితీయమని కొనియాడారు. ఆమె నాయకత్వంలో తెలంగాణ జాగృతి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం పాటుపడుతోందని గుర్తుచేశారు. కవిత గారి ఆశయాలకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో జాగృతి రాష్ట్ర కమిటీ సభ్యులు అంబటి శ్రీనివాస్ గౌడ్, ఇరుముల శంకర్, తెలంగాణ శంకర్, దొంతు ప్రవీణ్, హన్మాండ్లు, సంతోష్, గోపాల్, జాగృతి శ్రేణులు పాల్గొన్నారు.



## బాసర ట్రిపుల్ ఐటీలో సాలూర విద్యార్థుల సందడి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐటీ వొకేషనల్ విద్యార్థులు శుక్రవారం బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యూనివర్సిటీలో ఉన్న ఆధునిక సాంకేతిక వసతులు, విద్యా వాతావరణాన్ని దగ్గరగా పరిశీలించారు. యూనివర్సిటీ సందర్శనలో భాగంగా విద్యార్థులు ముందుగా అక్కడి డిజిటల్ లైబ్రరీని వీక్షించారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు శేఖర్ ఐటీ రంగంలో వస్తున్న మార్పులు, విద్యార్థులు నేర్చుకోవాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. భవిష్యత్తులో ఐటీ రంగం అందించే ఉపాధి అవకాశాల గురించి ఆయన వారికి అవగాహన కల్పించారు.సైకాలజీ విభాగం అధ్యాపకులు శ్రీనివాస్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మోటివేషనల్ సెషన్‌ను నిర్వహించారు. కష్టపడి చదవడం ద్వారా ఉన్నత లక్ష్యాలను ఎలా చేరుకోవాలి? లక్ష్యం పట్ల ఏకాగ్రతను ఎలా కొనసాగించాలి? అనే అంశాలపై ఆయన విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులు ఇటువంటి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, నిరంతర సాధనతోనే గొప్ప విజయాలు సాధించవచ్చని వక్తలు సూచించారు. ఈ విజ్ఞాన యాత్ర ద్వారా విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం కనిపించింది.







# అనుమతి గడువు ముగిసినా.. తగ్గెల్లిలో కదలని ఇసుక డంపులు!

- **ఇసుక నిల్వలపై అధికారుల మౌనం**
- **అక్రమ నిల్వలను సీజ్ చేయాలి : తగ్గెల్లిలో స్థానికుల డిమాండ్**



**బోధన్, నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని తగ్గెల్లి గ్రామంలో ఇసుక రవాణాకు సంబంధించి అధికారుల తీరు విమర్శలకు దారితీస్తోంది. రెండు నెలల క్రితం ప్రైవేటు వాహనాల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతులు మంజూరయ్యాయి. అయితే, ఆ గడువు ముగిసి సుమారు రెండు నెలలు గడుస్తున్నా ఇంకా ఇసుక డంపులు అక్కడే దర్శనమివ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రైవేటు వాహనాల ద్వారా ఇసుక తరలింపునకు ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసింది. నిబంధనల ప్రకారం గడువు ముగిసిన వెంటనే ఆ ప్రదేశంలో ఉన్న ఇసుకను స్వాధీనం చేసుకుని, దానిని ప్రభుత్వ పరంగా వేలం వేయాలి. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ నిల్వలు ఇంకా అక్కడే పేరుకుపోయి ఉన్నాయి. అనుమతులు లేని సమయంలో కూడా నిల్వలను అలాగే ఉంచడం వెనుక ఆంతర్యమేమిటో అధికారులే చెప్పాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

*పట్టించుకోని అధికార యంత్రాంగం *

గడువు ముగిసి రెండు నెలలైనా అధికారులు దీనిపై స్పందించకపోవడం దేనికి సంకేతమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడటమే కాకుండా, అనుమతులు లేని అక్రమ నిల్వలు కొనసాగుతుండటం పట్ల గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనుమతి గడువు ముగిసిన తర్వాత కూడా ఇసుక డంపులు అలాగే ఉండటం అక్రమ రవాణాకు ఊతమివ్వడమే అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి గడువు ముగిసిన సదరు ఇసుకను వెంటనే స్వాధీనం చేసుకోవాలని, పారదర్శకంగా వేలం నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

## పది పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

- **ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఆంక్షలు**
- **జిరాక్స్ సెంటర్లు మూసివేయాలి: సీపీ సాయి చైతన్య**




**నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు సీపీ పి.సాయి చైతన్య వెల్లడించారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని 144 పరీక్షా కేంద్రాల వద్ద మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు 163 బిఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేఫ్‌లు, స్టేషనరీ షాపులను తప్పనిసరిగా మూసివేయాలని యజమానులను ఆదేశించారు. కేంద్రాల వద్ద ఎటువంటి సభలు, ర్యాలీలు, ధర్నాలు లేదా మైకుల వినియోగానికి అనుమతి లేదని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకురాకూడదని సూచిస్తూ, విద్యార్థులందరూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ డిపోలో ఇఫ్తార్ విందు

**బాన్సువాడ, మార్చి 13(డిడి9 వార్త):**

పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం బాన్సువాడ ఆర్టీసీ డిపోలో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవికుమార్ హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపవాసం పాటిస్తున్న ముస్లింలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ మంజుల, హెడ్ గార్డ్ రాజారామ్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సలీం, కార్యదర్శి హఫీజ్, మజీద్, అలావుద్దీన్, సయ్యద్ ఇంతియాజ్, ఇర్ఫాన్, ఫాహీం, రిటైర్డ్ ఉద్యోగులు కౌసర్, మహిమూద్, అలాగే కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సేవా భావంతో కవిత జన్మదిన వేడుకలు : వృద్ధులకు అన్నదానం



**నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పుట్టినరోజు వేడుకలను మోస్రా మండలంలోని చింతకుంట స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలోని ఉచిత వృద్ధాశ్రమంలో ఎంతో అర్థవంతంగా జరుపుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వృద్ధుల ముఖాల్లో ఆనందం చూసేందుకు పార్టీ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో కేక్ కట్ చేయించి, వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కవిత ఆశయాలకు అనుగుణంగా, వృద్ధులకు భరోసా కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం ఆశ్రమ వాసులకు ప్రత్యేకంగా భోజన వసతి కల్పించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కవిత పుట్టినరోజును కేవలం వేడుకగానే కాకుండా, ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా జరుపుకోవడం పట్ల స్థానికులు, ఆశ్రమ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, జాగృతి శ్రేణులు పాల్గొన్నారు.





## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: సీపీ సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా 13 మార్చి(డీడీ9 వార్త) :**



న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడానికి ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పిలుపునిచ్చారు. రాజీ మార్గమేరాజ మార్గం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ లోక్ అదాలత్ ద్వారా చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ వివాదాలు, సివిల్ డిస్ప్యూట్లు వంటి అంశాలను సులభంగా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవడానికి ఇది ఒక గొప్ప అవకాశమని, పక్షాలు పరస్పర అంగీకారంతో శాంతియుత వాతావరణంలో సమస్యల నుండి విముక్తి పొందవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివాదాలను పరిష్కరించుకోవాలని, తద్వారా సమయం, ధనం ఆదా అవుతాయని సీపీ విజ్ఞప్తి చేశారు.





## ఆశను కోల్పోవద్దు.. విడాకుల తర్వాత
# హన్సిక మొదటి పోస్ట్

నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు. విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్దీ కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం.

'ఆస్కార్' ఎంట్రీ.. నేషనల్ అవార్డు.. 40 ఏళ్ల 'స్వాతిముత్యం' విశేషాలివి..!

2022 డిసెంబర్‌లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది.

## టైటిల్, ఫస్ట్ లుక్ మాత్రమే కాదు..
# ఏప్రిల్ 8న అంతకుమించి!

'పుష్ప' చిత్రంతో గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన 'ఐకాన్ స్టార్' అల్లు అర్జున్.. వరుస బ్లాక్ బస్టర్లతో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు అట్లీతో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రేజీ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచి అభిమానుల్లో అంచనాలు రెట్టింపు అయ్యాయి. #AA22 వర్కింగ్ టైటిల్. ఇప్పటికే షూటింగ్ జెట్ స్పీడ్‌లో జరుగుతుండగా.. హాలీవుడ్ రేంజ్‌లో విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చినా సరే సోషల్ మీడియా షేక్ అవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ గురించి సోషల్ మీడియాను షేక్ చేస్తున్నారు అల్లు అభిమానులు.

ఏప్రిల్ 8న అల్లు అర్జున్ పుట్టినరోజు. ఈ సందర్భంగా టైటిల్, ఫస్ట్ లుక్ మాత్రమే కాదు.. అంతకుమించి అనేలా సాలిడ్ గ్లింప్స్ రిలీజ్ చేస్తున్నట్టుగా నెట్టింట వార్తలు వస్తున్నాయి. అంతేకాదు విడుదల తేదీని కూడా అధికారికంగా ప్రకటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమా కోసం అట్లీ ఒక అదిరిపోయే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో బన్నీ ఎలాంటి లుక్‌లో కనిపించనున్నాడనే ఆసక్తి అందరిలోను ఉంది. ఎందుకంటే ఇందులో ఆయన విభిన్న పాత్రల్లో కనిపించనున్నట్టుగా టాక్ ఉంది.

సాధారణంగా అట్లీ తన సినిమాల్లో హీరోలను అత్యంత స్టైలిష్‌గా, పవర్‌ఫుల్‌గా చూపిస్తుంటాడు. కాబట్టి అల్లు అర్జున్ ఫస్ట్ లుక్ ఎలా ఉండబోతుందో అని ఫాన్స్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ అని చిత్ర బృందం హింట్ ఇస్తోంది. దీంతో టైటిల్ అనౌన్స్‌మెంట్‌తోనే ఇంటర్నెట్ షేక్ అవ్వడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ మూవీలో దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ.. 2027లో రిలీజ్ కానుంది. ఇది అల్లు అర్జున్ కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన చిత్రంగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.





## తల్లికి సపోర్ట్ గా తండ్రి పేరును తొలగించిన విజయ్ కొడుకు..!

తమిళ రాజకీయ, సినీ వర్గాల్లో ప్రస్తుతం దళపతి విజయ్ కుటుంబానికి సంబంధించిన వార్తలు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. హీరో విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని (తమిళగ వెట్రి కళగం TVK)తో అత్యంత ప్రతిష్టాత్మకంగా మొదలుపెట్టగా.. ఇప్పుడు ఆయన కుమారుడు జాసన్ సంజయ్ తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు వార్తల్లో నిలిచింది.

తమిళ సూపర్ స్టార్, తమిళగ వెట్రి కళగం (TVK) అధినేత విజయ్ వ్యక్తిగత జీవితంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారాయి. విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ త్వరలో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్న సంగతి తెలిసిందే. అయితే తన తాజా ప్రాజెక్ట్ క్రెడిట్స్‌లో, ఇంకా సోషల్ మీడియా హ్యాండిల్స్ లో ఆయన తన పేరును మార్చుకున్నారు.

సాధారణంగా జాసన్ తన పేరును 'జాసన్ సంజయ్ విజయ్' అని పిలిపించుకునేవారు. కానీ ఇప్పుడు తన పేరు నుంచి తండ్రి పేరును తొలగించి, తల్లి పేరును చేరుస్తూ 'జాసన్ సంజయ్ సంగీత'గా మార్చుకున్నట్లు సమాచారం. తన తండ్రి కంటే తల్లికే ప్రాధాన్యత ఇస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం విజయ్ అభిమానులను విస్మయానికి గురిచేస్తోంది. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య గత కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ మరొక నటితో సంబంధం కలిగి ఉన్నారని ఆరోపిస్తూ, సంగీత విడాకుల కోసం కోర్టును ఆశ్రయయించింది. ఆ తర్వాత విజయ్ నటి త్రిషతో సన్నిహితంగా ఉంటున్నారనే వార్తలు ఈ వివాదానికి మరింత బలం చేకూర్చాయి. దీనితో తన తల్లి పడుతున్న వేదనను చూసి, ఆమెకు అండగా నిలబడాలనే ఉద్దేశంతోనే జాసన్ సంజయ్ తన తండ్రి పేరును పక్కన పెట్టినట్లు సన్నిహిత వర్గాలు చర్చించుకుంటున్నాయి.

# ఇప్పటిదాకా భరించా.. ఇక సహించేది లేదు



సోషల్ మీడియా వేదికగా గత కొన్నేళ్లుగా తనపై జరుగుతున్న వ్యక్తిగత దాడులు, అసత్య ప్రచారాలపై కన్నడ బ్యూటీ రష్మిక మందన్న ఎట్టకేలకు పెదవి విప్పింది. సుమారు ఎనిమిదేళ్లుగా తనపై దుష్ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఓపికతో మౌనంగా ఉన్నానని కానీ ఇప్పుడు ఆ మౌనాన్ని వీడాల్సిన సమయం వచ్చిందని ఆమె స్పష్టం చేశారు. తాజాగా రష్మిక తల్లి సుమన్ మందన్నకు సంబంధించిన ఒక ఆడియో క్లిప్ లీక్ అవ్వడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఆడియో క్లిప్ ప్రకారం రష్మిక మరియు రక్షిత్ శెట్టిల మధ్య గొడవలకు ప్రధాన కారణం రష్మిక కెరీర్ అని, పెళ్లి తర్వాత రష్మిక సినిమాల్లో నటించకూడదని, నటనకు స్వస్తి చెప్పాలని రక్షిత్, అతని కుటుంబం డిమాండ్ చేసినట్లు సుమన్ మందన్న ఆరోపించారు. అంతేకాకుండా, సినిమాల్లో నటించనని రష్మిక సోషల్ మీడియా వేదికగా బహిరంగంగా ప్రకటించాలని కూడా వారు ఒత్తిడి తెచ్చినట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'గీత గోవిందం' సినిమాలో విజయ్ దేవరకొండతో రష్మిక చేసిన ఒక కిస్సింగ్ సీన్ పట్ల రక్షిత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని ఆ ఆడియోలో ఉంది.ఇక ఇదే అంశం మీద రష్మిక తమ అభిమాన నటిగా తనను ఆదరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలుపుతూనే, మరోవైపు మీడియాలోని ఒక వర్గం, సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు తనను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "నేను అనని మాటలను అన్నట్లుగా సృష్టించడం, నా వ్యాఖ్యలను సందర్భం లేకుండా వాడుతూ వ్యూస్ కోసం ద్వేషాన్ని పెంచడం చూసి చాలా బాధపడ్డాను, పబ్లిక్ లైఫ్ లో ఉన్నప్పుడు విమర్శలు సహజమే అని ఇప్పటిదాకా భరించాను" అని ఆమె పేర్కొన్నారు. తాజాగా గత 24 గంటల్లో జరిగిన కొన్ని పరిణామాలు గీత దాటాయని రష్మిక మండిపడ్డారు. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఒక ప్రైవేట్ సంభాషణను, తన అనుమతి లేకుండా రికార్డ్ చేసి ఇప్పుడు లీక్ చేయడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వ్యక్తిగత జీవితంలోని పరిణామాలకు అనుగుణంగా, కావాలనే ఆ సంభాషణలోని ఒక చిన్న భాగాన్ని సందర్భం లేకుండా వాడుతూ వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆమె వివరించారు. ఈ వ్యవహారంలోకి తన కుటుంబ సభ్యులను, తనతో స్నేహపూర్వకంగా ఉండేవారిని లాగడం అత్యంత దురదృష్టకరమని ఆమె అన్నారు.

వ్యక్తిగత గోప్యతను భంగపరిచే ఇలాంటి కంటెంట్ ను ప్రసారం చేస్తున్న మీడియా సంస్థలు, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు వెంటనే వాటిని తొలగించాలని రష్మిక డిమాండ్ చేశారు. "ఈ ప్రకటన చేసిన 24 గంటల్లోగా ఆ కంటెంట్ ను తొలగించకపోతే, రేపటి నుండి చట్టపరమైన చర్యలు చేపడతాము. అవసరమైన వారికి లీగల్ నోటీసులు పంపుతాము" అని ఆమె హెచ్చరించారు. కన్నడ భాషలో కూడా ఒక సందేశాన్ని ఇస్తూ.. "నా వ్యక్తిగత జీవితం గురించి ఇష్టానుసారంగా మాట్లాడేవారు ఒకటి గుర్తుంచుకోవాలి. నా జీవితం ఎలా ఉండాలో నిర్ణయించేది వారు కాదు. నా జీవితం నాది, నా నిర్ణయాలు నేనే తీసుకుంటాను" అని గట్టిగా సమాధానం ఇచ్చారు.

# డాల్బీ ఫార్మేట్‌లో పెద్ది

తెలుగులో అగ్ర తారల సినిమాలు అత్యాధునిక సాంకేతిక హంగులతో రూపొందుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుండడంతో అందుకు తగ్గ ప్రమాణాలు తమ సినిమాల్లో కనిపించేలా జాగ్రత్తలు తీసుకొంటున్నాయి నిర్మాణ సంస్థలు. రామ్‌చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రాన్ని డాల్బీ సినిమాస్ ఫార్మేట్‌లో విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. ప్రత్యేకమైన కథా నేపథ్యం, భారీస్థాయి యాక్షన్ అంశాలు, భావోద్వేగాల మేళవింపుగా రూపొందుతున్న ఈ సినిమా డాల్బీ ఫార్మేట్‌లో ప్రేక్షకులకు మరింత ఘనమైన, ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు చెప్పాయి. ఈ ఏడాది భారీస్థాయి అంచనాల మధ్య రూపొందుతున్న సినిమాల్లో 'పెద్ది' ఒకటి. ఏప్రిల్ 30న విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

## అవతలి వ్యక్తి కోసం నన్ను నేను తగ్గించుకున్నా..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ అనన్య పాండే తన గత ప్రేమ ప్రయాణాలు, వాటి ద్వారా తను నేర్చుకున్న పాఠాల గురించి తాజాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా రిలేషన్‌షిప్‌లో ఉండగా తనను తాను ఎలా తగ్గించుకునేదో వివరిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అనన్య మాట్లాడుతూ.. "గతంలో నేను రిలేషన్‌షిప్‌లో ఉన్నప్పుడు అవతలి వ్యక్తి నాకంటే ఎక్కువగా మెరవాలని కోరుకునేదాన్ని. ఇందుకోసం నన్ను నేను తక్కువ చేసుకునేదాన్ని. ఎదుటి వ్యక్తికి నచ్చేలా నన్ను నేను మార్చుకునేదాన్ని. ఒక వ్యక్తి కోసం మనల్ని మనం మార్చుకోకూడదని నేను ఆలస్యంగా తెలుసుకున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఒక్క క్షణం కూడా ఒంటరిగా ఉండలేకపోయేదాన్ని అని, కానీ ఇప్పుడు ఒంటరిగా ఉండటం, తన వ్యక్తిగత స్పేస్‌ను ఆస్వాదించడం నేర్చుకున్నానని ఆమె వెల్లడించారు.

కాగా.. అనన్య పాండే గతంలో నటుడు ఇషాన్ ఖట్టర్‌తో డేటింగ్ చేశారు. ఆ తర్వాత ఆదిత్య రాయ్ కపూర్‌తో రెండేళ్ల పాటు రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే మే 2024లో వీరిద్దరూ విడిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం అనన్య, మోడల్ వాకర్ బ్లాంకోతో డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్‌లో జోరుగా ప్రచారం సాగుతోంది. అనంత్ అంబానీ వివాహ వేడుకల్లో వాకర్‌ను తన 'పార్ట్నర్'గా అనన్య పరిచయం చేసినట్లు వార్తలు వచ్చాయి. అనన్య సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆమె లక్ష్య లల్వానీ సరసన 'చాంద్ మేరా దిల్' అనే రొమాంటిక్ డ్రామాలో



నటిస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా మే 8, 2026న విడుదల కానుంది. వీటితో పాటు ఆమె నటించిన పాపులర్ వెబ్ సిరీస్ 'కాల్ మీ బే' సీజన్ 2 కూడా త్వరలో రాబోతోంది.